క్లుప్తంగా

హార్టికల్చర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కొండలక్ష్మణ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులకు ఈనెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరంలో రెండేళ్ల డిప్లొమా కోర్సులకు గాను 40 సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని, 22 సంవత్సరాల వయస్సు మించకూడదని తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నారని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అల్తాఫ్, నగేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలను అతిక్రమిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీనియర్ సిటీజన్ కార్డు తీసుకోవాలి

తాంసి: వయోవృద్ధులు ప్రతిఒకరూ సీనియర్ సిటీజన్ కార్డు తీసుకోవాలని జిల్లా వయోవృద్ధుల సమైఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలో వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధులకు తల్లితండ్రుల పోషణ, సంక్షేమ చట్టం, సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని వయోవృద్ధులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్ సభ్యులు గంగాధర్, శంకర్, కిషన్, మోహన్, గ్రామస్తులు కృష్ణ, బాపన్న, దామయ్య, కిష్టు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అవర్లీ బేస్డ్ టీచర్ (హెచ్‌బీటీ) హిందీ (టీజీటీ), ఆంగ్లం(పీజీటీ) సబ్జెక్టు బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. హిందీ టీజీటీ పోస్టుకు బీఎడ్, హెచ్‌పీటీతో పాటు టెట్ అర్హత ఉండాలన్నారు. ఆంగ్లం పీజీటీ పోస్టుకు బీఎడ్, ఎంఏ ఇంగ్లీష్ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఇంగ్లిష్ అధ్యాపక పోస్టుకు..

బోథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంగ్లిష్ అధ్యాపక పోస్టు (పీజీటీ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంఏతో పాటు బీఈడీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25న దరఖాస్తు చేసుకోవాలన్నారు. గరిష్ఠ వేతనం రూ.18,200లు ఉంటుందని తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

ఇచ్చోడ: ఖరీఫ్‌లో ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు రైతులకు మెరుగైన సేవలు అందించాలని మండల వ్యవసాయాధికారి భగత్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. ఖరీఫ్ సీజనలో రైతులకు ఇబ్బంది కలుగకుండా అన్ని రకాల పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. స్టాక్ రిజిస్టార్‌లో నమోదు చేయాలని సూచించారు.

ప్రతీ ఆటోకు క్యూఆర్ కోడ్ ఉండాలి

బేల: మై ఆటో ఈస్ సేఫ్‌లో భాగంగా ఎవరైతే రిజిస్ట్రేషన్ చేసుకున్నారో ఆ ప్రతీ ఆటోకు క్యూఆర్ కోడ్ ఉండాలని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వారసంతలో ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌లు అంటించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రయాణికుల భద్రత కోసం మై ఆటో ఈస్ సేఫ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆటోలో ప్రయాణం చేసేటప్పుడు డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించినా, దురుసుగా మాట్లాడినా, సురక్షిత ప్రయాణమైనా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో ఎమర్జెన్సీ ఫోన్‌తో పాటు డ్రైవర్ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా సాధన చేస్తూ..



యోగా ప్రయోజనాల గురించి వివరిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆయుష్ కార్యాలయంలో టీబీ నుంచి కోలుకున్న వారితో శుక్రవారం యోగా సాధన చేయించారు. టీబీ అనుమానితులు సమీపంలోని పీహెచ్‌సీల్లో స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇందులో ఆయుష్ జిల్లా కోఆర్డినేటర్ ప్రీతమ్ సింగ్, నోడల్ ఆఫీసర్ చంద్రశేఖర్, డిప్యూటీ నోడల్ అధికారి శ్రీకాంత్, సంజీవ్, రాథోడ్, నారాయణ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: యోగాతో జీవనశైలిలో మార్పు వస్తుందని యోగా గురువు సంతోష్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీపార్క్ యోగా టీమ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా ఆసనాలు వేశారు. యోగా ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఒక్కరూ తమ జీవితాల్లో దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాయిప్రసాద్, సంజయ్, శ్రీనివాస్ యాదవ్, సంతోష్, గంగాధర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించే యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఉదయం 6 గంటలకు యోగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోడు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

నేరడిగొండ: పోడు భూములు సాగు చేస్తున్న రైతులను ఇబ్బంది పెట్టవద్దని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ అన్నా రు. శుక్రవారం పోడు రైతులతో కలిసి ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నేరడిగొండ మండలంలోని తర్నం గ్రామస్తుల పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు రైతులకు తెలియకుండానే విత్తనాలు చల్లుతున్నారని పేర్కొన్నారు. ఆ భూములను పోడు రైతులకే వదిలేయాలని కోరారు. గత 30 ఏళ్ల నుంచి భూములను సాగు చేసుకుంటున్నారని, అకస్మాత్తుగా వచ్చి మొక్కలు పెడతామని, ఫారెస్ట్ భూమి అని బెదిరిస్తున్నారని ఆరోపించా రు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

నేరడిగొండ: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం అవుతాయని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రోల్‌మామడ గ్రామంలో డ్రై డేపై అవగాహన కల్పించడంతో పాటు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి హారిక, ఎస్‌సీఆర్పీ ప్రకాష్, ఏఈవో సౌజన్య, ఏఎన్ఎం అమ్మిబాయి, ఆశ కార్యకర్త సుంగలిబాయి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగల్‌కొండ, భీంపూర్, మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలో డ్రై డే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు కుటుంబ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో తులసిదాస్ రాథోడ్, మహిళ సూపర్‌వైజర్ సత్తవ్వ, వైద్య సిబ్బంది జవహర్, కైలాస్, ఈశ్వర్, జంగుబాయి, విమల, సింధు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో రవీందర్

మొక్కల సంరక్షణకు కృషి చేద్దాం

ఇంద్రవెల్లి: అమరవీరుల స్తూపం వద్ద స్మృతివనంలో నాటిన మొక్కల సంరక్షణకు కృషి చేద్దామని రాయిసెంటర్ల సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్, చిన్ను పటేల్‌లు అన్నారు. శుక్రవారం అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనంలో మొక్కలు నాటారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీలకు ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేసి స్తూపాన్ని అభివృద్ధి చేయడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం అధికారులు సుందరీకరణ కోసం స్తూపం ప్రాంగణంలో నాటుతున్న మొక్కలను రక్షించేందుకు కమిటీ సభ్యులు కృషి చేసి, మరింత అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కొరెంగా సుంకట్‌రావ్, తోడసం నాగోరావ్, మెస్రం నాగ్‌నాథ్, జుగ్నాక్ భారత్, కొట్నాక్ భారిక్‌రావ్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఆదివాసీ నాయకులు

జీరో అకౌంట్ క్యాంపు సందర్శన

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన డిగ్రీ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జీరో బ్యాంక్ అకౌంట్ క్యాంపును ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జి. రామచంద్రరావు సందర్శించారు. జీరో అకౌంట్ ఇప్పించేందుకు కృషి చేసిన రీజనల్ మేనేజర్‌కు, ఎస్‌బీఐ బ్యాంకు అధికారులకు కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. చీఫ్ మేనేజర్ బాలకృష్ణ, ఘనిల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నేరడిగొండ: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బుగ్గారం బాలికల రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం కళాశాల విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు, యువతలో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరం

ఉట్నూర్‌రూరల్: పార్టీ బలోపేతం కోసం నిత్యం శ్రమించిన ఉట్నూర్ మండల కాంగ్రెస్ రథసారథి అబ్దుల్ ఖయ్యుం గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. ఆయన పార్టీకి అందించిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

సన్మానం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించిన సాయి చైతన్య ఇటీవల నిర్వహించిన యూపీఎస్సీ ఐఎఎస్ పరీక్షల్లో 68వ ర్యాంకు సాధించడంతో పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘన సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ సత్యనారాయణ, కరస్పాండెంట్ రాము, ప్రిన్సిపాల్ నైజో సెబాస్టియన్, శృతి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులు పోలీసులను ఆశ్రయించాలి

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి
- ప్రభుత్వ ఉద్యోగి షాకిర్‌పై 11 కేసులు నమోదు
- లక్షల్లో డబ్బులు కాజేసిన వైనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు ప్లాట్లు ఇప్పిస్తానని, భూకబ్జాలకు పాల్పడిన నిందితుడు షాకిర్ చేతిలో మోసపోయిన బాధితుల సంఖ్య పెరుగుతోంది. గురువారం వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో మరికొంత మంది బాధితులు తమ గోడును పోలీసులకు వెల్లబోసుకుంటున్నారు. తమవద్ద కూడా డబ్బులు తీసుకొని ప్లాట్లు ఇప్పిస్తానని కొంత మంది, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి స్థలం చూపించకుండా ఇంకొంత మందిని మోసం చేసినట్లు బాధితులు వన్‌టౌన్, మావల, రూరల్ పోలీస్‌స్టేషన్‌లలో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. గురువారం నిందితుడిపై ఏడు కేసులు నమోదు కాగా, శుక్రవారం మరో నాలుగు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. పట్టణంలోని మసూద్‌నగర్‌కు చెందిన మహ్మద్ తాజొద్దీన్ అలియాస్ షాకిర్ నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో గల కోర్టులో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులుగా సెలవులో ఉన్నాడని పేర్కొన్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి భైంసాలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. లింక్ డాక్యుమెంట్లు, పట్టా తదితర వాటిని పరిశీలించిన అనంతరమే డబ్బులు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. భూకబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

తలమడుగు: మండలంలో గత కొన్ని రోజులు నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని సకినాపూర్, లచ్చమ్‌పూర్ గ్రామాల్లో చివరి రోజు భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహిచారు. భూ సమస్యలను రైతులు అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. సకినాపూర్ గ్రామంలో 26 దరఖాస్తులు, లచ్చమ్‌పూర్‌లో 23 దరఖాస్తులు వచ్చానట్లు తహసీల్దార్ రాజ్‌మోహన్ తెలిపారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భూభారతి రెవెన్యూ సదస్సులు

బజార్‌హత్నూర్: మండలంలో 30 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారం మోర్కండి, వర్తమన్నూర్ గ్రామల్లో నిర్వహించిన సదస్సులతో ముగిసినట్లు తహసీల్దార్ శ్యాంసుందర్ తెలిపారు. భూభారతి చట్టంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, ఆర్ఐలు నూర్‌సింగ్, మహేందర్, కరుణకర్‌రెడ్డి, స్రవంతి, రమేశ్, అశాతాయి, గౌతం పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న గ్రామస్తులు, అధికారులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఇచ్చోడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు క్లెం నారాయన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. ఇల్లు మంజూరైన వారు వెంటనే పనులు మొదలు పెట్టుకోవాలన్నారు.

ప్రజా ప్రభుత్వంతోనే సొంతింటి కల సాధ్యం

నేరడిగొండ: ప్రజా ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాధ్యమవుతుందని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కుమారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, నారాయణ గౌడ్, పంచాయతీ కార్యదర్శి దాతత్రి, భీమ్‌రాజ్ గౌడ్, అగు రమేశ్, నారాయణ, సాయన్న పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధికోసమే విమర్శలు'

కైలాస్‌నగర్: పదేళ్ల పాలనలో ప్రజలకు ఏం చేయనందునే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారనే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న గ్రహించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతుకు విత్తన సమయంలో రైతు భరోసా కింద అందిస్తున్న పెట్టుబడి సాయంపై ఎన్నికల బంధు అంటూ జోగు రామన్న విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఏం వెలగబెట్టారని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూం, ఉద్యోగాల కల్పనలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రుణమాఫీ చేయకుండా ఇచ్చిన హామీలన్నింటిని విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే తమ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వైఖరిని మార్చుకోకుంటే ప్రజలే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.


మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

అక్రమంగా నీటి కనెక్షన్లు పెట్టుకోవద్దు

నార్నూర్: గ్రామ పంచాయతీ నీటి సరఫరా పైపు లైన్, మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు అక్రమంగా నీటి కనెక్షన్ పెట్టుకోవద్దని డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం జీన్‌గూడ, వడ్డెరకాలనీ, మైనార్టీవార్డు సంబంధించిన మహిళలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో శుక్రవారం డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో గంగాసింగ్ పలు వార్డులను సందర్శించారు. అక్రమ కనెక్షన్లు తొలగించి ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు సరఫరా చేయించారు. ఇప్పటి నుంచి గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి మోతిరామ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

బోథ్: మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న లోక రాజేందర్ రెడ్డి (53) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ గ్రామానికి చెందిన లోక రాజేందర్ రెడ్డి గత మూడు నెలలుగా బోథ్ మండల కేంద్రంలో నివాసముంటున్నాడు. రెండు నెలల నుంచి పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం పాఠశాల ఆవరణలో ఉరి వేసుకున్నాడు. కాగా తన మేనమామ అయిన రాజేందర్ గత కొంత కాలంగా మానసిక ఆరోగ్యం బాగోలేదని, జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని మృతి చెందినట్లు విజయరెడ్డి తెలిపారు. విజయరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

తలమడుగు: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని డోర్లి గ్రామానికి చెందిన మార్కపు ప్రవీణ్ (30) ఏ పని చేయకుండా ఖాళీగా తిరిగేవాడు. ఈ క్రమంలో అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన ప్రవీణ్ శుక్రవారం ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాధిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవించిన ఇద్దరి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ఇద్దరు వ్యక్తులపై గంజాయి సేవించినందుకు కేసు నమోదు చేసినట్లు టు టౌన్ సీఐ కరుణకర్ రావు తెలిపారు. పట్టణంలోని స్పిన్నింగ్ మిల్లు వద్ద గల ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా వారిని చూసి రాథోడ్ దత్తు, వతుర సంతోష్ పారిపోయే ప్రయత్నం చేశారు. అనుమానం వచ్చి వారిని వెంబండించి పట్టుకొని గంజాయి టెస్ట్ చేయగా పాజిటివ్ వచ్చినట్లుగా పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్నం లోయర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ముగ్గురు కూలీలు వాగులో పడి తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి సాంగిడికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు తర్నం లెవెల్ వంతెన వద్ద ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ మేశ్రం చిరంజీవి, కూలీలు మెస్రం శంకర్, వాగాడే లక్ష్మణ్ మీసం సహజన్‌లకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో వాగాడే లక్ష్మణ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నకిలీ పత్రాలతో ప్లాట్లు విక్రయించిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని కేఆర్కే కాలనీ శివారు ప్రాంతంలో నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్లు విక్రయించిన వ్యక్తిని అరెస్టు చేసిన్నట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రజిని ఆదినాథ్ భార్య భర్తలు కేఆర్కే కాలనీ శివారు ప్రాంతాంలోని సర్వే నంబర్ 68/44/1లో మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైలాస్‌నగర్ కాలనీకి చెందిన శోభ మురార్‌కర్‌కు 2010లో నాలుగు ప్లాట్లు విక్రయించారు. అయితే సర్వే నంబర్ 135 అటవీ భూమిలో ఆ ప్లాట్ల లోకేషన్‌ను చూపించారు. తప్పుడు పత్రాలను సృష్టించి ఆ భూమి తనదేనని శోభకు నమ్మించి ఒక్కొక్క ప్లాట్‌కు రూ. 82 వేలు తీసుకున్నారు. తనను నమ్మించి మోసం చేసిన రజినితో పాటు ఆయన భర్త ఆదినాథ్‌పై శోభ మురార్‌కర్ గురువారం ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చినా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆదినాథ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకోని విచారిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి

బోథ్: మండలంలోని రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రఘునాథ్‌పూర్ అటవీ శివారులో గోపాల్‌పేట ప్రాంతం నుంచి పశువుల కాపరి రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలో ఆవులను మేపుతుండగా.. చిరుత లేగదూడపై దాడి చేసింది. దీంతో లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది. కంటెగాం చెరువు సమీపంలో మరో ఆవును చిరుత చంపి తిన్నట్లు తెలుస్తోంది. చిరుతల అలజడితో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కోతికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న భక్తులు, యువకులు

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామంలో కుక్కల దాడిలో మృతి చెందిన కోతికి యువకులు, భక్తులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మర్లపెల్లి గ్రామంలో కోతిపై కుక్కలు దాడి చేశాయి. గమనించిన నరేశ్, ఆకాశ్, అభి వెంటనే బోథ్ మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అందజేశారు. ఫలితం లేకపోవడంతో కోతి మృతి చెందింది. దీంతో రామభక్తులు, యువకులు కోతికి అంత్యక్రియలు నిర్వహించారు.

ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయించాలి

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ర్యాంకుల ఆధారంగానే సీట్లు కేటాయించాలని టీజీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ర్యాంకులు వచ్చిన విద్యార్థులు అడ్మిషన్ పొందితే తదుపరి ర్యాంకు వారికి అవకాశం ఇవ్వాలన్నారు. అవకతవకలకు తావు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు సతీష్, భూమేష్ పాల్గొన్నారు.

టీయూసీఐ జిల్లా కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కార్యవర్గాన్ని పట్టణంలోని సంఘ భవనంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దళిత్, జగన్‌సింగ్, ఉపాధ్యక్షులుగా షకీల్, సహాయ కార్యదర్శిగా ఉమ్రె నితిన్, కోశాధికారిగా గెడం మనోజ్, కమిటీ సభ్యులుగా ఎండీ ఇర్ఫాన్, బుచ్చిరాం, సైవాజ్, సురేశ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.